నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 5 జూన్ 2024 | RANGAREDDY

# నోటాకు నాలుగో స్థానం



- ఈసారి నోటాకు పోలైన ఓట్లు 6308
- గత పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు పోలైన 9220 ఓట్లు
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ బీజేపీకి ఆధిక్యం
- బీజేపీ అభ్యర్థి కొండాకు 11,365 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

వికారాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలో చాలా మంది ఓటర్లు నోటాకు మొగ్గు చూపారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని చేవెళ్ల, రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, వికారాబాద్, తాండూరు, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓటర్లు చాలా వరకు నోటాకు ఓటేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో నోటాకు పడిన ఓట్లు కొంతమేర తగ్గింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు 9220 ఓట్లు మాత్రమే రాగా, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 6308 ఓట్లు నోటాకు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 2912 ఓట్లు తక్కువగా పోలయ్యాయి. అయితే ఏదేని నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటాకు ఓటేసే అవకాశాన్ని ఓటర్లకు ఎన్నికల సంఘం కల్పించడంతో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నోటాకు ఓటర్లు ఓటేశారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రతి రౌండ్‌లో నోటాకు వచ్చిన ఓట్లు పెరిగాయి. ప్రతి రౌండ్‌లో స్వతంత్ర అభ్యర్థులకు మించి నోటాకు ఓట్లు రావడం గమనార్హం. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగో స్థానంలో నోటా నిలువడం గమనార్హం. మరోవైపు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరిట మరొకరు పోటీలో ఉన్న అభ్యర్థికి 3 వేలకుపైగా ఓట్లు పోలుకాగా, నోటా తర్వాత స్థానంలో నిలిచారు. ఏ మాత్రం తేడా లేకుండా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరిట మరొక అభ్యర్థి బ్యాలెట్ యూనిట్‌లో 4వ స్థానంలో ఉండగా కొంత మంది ఓటర్లు అయోమయంలో 4వ స్థానంలో ఉన్న అభ్యర్థికి ఓటేయడంతో ఐదో స్థానంలో నిలిచారు.

### పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీకే ఆధిక్యం..

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ బీజేపీ అధిక్యత సాధించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 19,397 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలుకాగా, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 11,365 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి 6124 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు 1428 ఓట్లు పోలయ్యాయి. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరిట పోటీలో ఉన్న మరొక అభ్యర్థికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ 12 ఓట్లు రావడం గమనార్హం.

### మూడు బ్యాలెట్ యూనిట్లతో ఓటర్లు కన్ఫ్యూజన్..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలెట్ యూనిట్లను వినియోగించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బరిలో 43 మంది అభ్యర్థులు పోటీ చేయడంతో మూడు బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మూడు బ్యాలెట్ యూనిట్లతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు కొంతమేర నష్టం జరిగింది. మూడు బ్యాలెట్ యూనిట్లు ఉండడంతో కొంత మంది ఓటర్లు అయోమయానికి గురైనట్లు పోలైన ఓట్లను పరిశీలిస్తే తెలుస్తున్నది. ఆయా పార్టీల అభ్యర్థులు బ్యాలెట్ యూనిట్‌లో మొదటి స్థానం, రెండో స్థానం, మూడో స్థానంలో తమకు ఓటేసి గెలిపించాలని ప్రచారంలో భాగంగా ఓటర్లను కోరారు. ఇంతవరకు బాగానే ఉన్న పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలెట్లు ఉండడంతో కొందరు ఓటర్లు అయోమయంతో రెండో బ్యాలెట్ యూనిట్లలోని మొదటి మూడు స్థానాల్లో ఉన్న అభ్యర్థులకు, మరికొందరు మూడో బ్యాలెట్ యూనిట్‌లోని మొదటి మూడు స్థానాల్లోని అభ్యర్థులకు ఓటేసినట్లు పోలైన ఓట్లను చూస్తే స్పష్టంగా అర్థమవుతున్నది. రెండు, మూడు బ్యాలెట్ యూనిట్లలోని మొదటి మూడు స్థానాల్లో అభ్యర్థులకు ప్రతి రౌండ్‌లోనూ 300-400 ఓట్లు పోల్ కావడం గమనార్హం.


# సజావుగా ఓట్ల లెక్కింపు

## సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.. కలెక్టర్ శశాంక



రంగారెడ్డి, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగింది. రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక నేతృత్వంలో వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియను ఆద్యంతం పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు మృణాళినీ సావంత్ ఓట్ల లెక్కింపు తీరును నిశితంగా పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంతరాల్లేకుండా ఓట్ల లెక్కింపు ప్ర క్రియ సాఫీగా పూర్తయ్యింది. డీసీపీ శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు బందోబస్తును పర్యవేక్షించారు. ఎలాంటి ఆటంకాల్లేకుండా జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ సాఫీగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ శశాంక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషిచేసిన అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# వెన్నుపోటుకు.. గుణపాఠం



## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురికీ తప్పని ఓటమి

### మల్కాజిగిరిలో పట్నం, చేవెళ్లలో రంజిత్, సికింద్రాబాద్‌లో దానం పరాజయం






సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 4 (నమస్తే తెలంగాణ): బెల్లం చుట్టూ ఈగల్లా... అధికారం చుట్టూ కొందరు నేతలు నిలకడ లేకుండా వ్యవహరిస్తారు. ప్రజలెవరూ ఇదేమీ గమనించడంలేదని భ్రమిస్తారు. కానీ... ప్రజా తీర్పులో మాత్రం ఆ మేరకు తేడా కొడుతుందని ఫలితాల్లో తేలిపోతుంది. ఇందులో భాగంగా తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లోనూ హైదరాబాద్ మహా నగర పరిధిలో జంపింగ్ జపాంగ్‌లకు ఓటర్లు భారీ ఝలక్ ఇచ్చారు. ప్రధానంగా ఎన్నికల ముందే బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి టికెట్లు దక్కించుకున్న ముగ్గురు అభ్యర్థులూ ఓటమి పాలయ్యారు.

గత ఏడాది చివరలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొలువుదీరింది. అనంతరం కొన్ని నెలలకే వచ్చిన పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ పరిణామాలు మారాయి. ఇందులో కొందరు నేతలు ఏండ్ల తరబడి కొనసాగిన పార్టీని, జెండాను వదిలి రాత్రికిరాత్రే పార్టీ ఫిరాయించారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి టికెట్లు సాధించి... ఎంపీలుగా మారాలనుకున్నారు. కానీ వారొకటి తలిస్తే... దైవమొకటి తలచినట్లుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ముగ్గురు అభ్యర్థులు ఓటమిపాలయ్యారు. తొలుత మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతారెడ్డి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. వాస్తవానికి వీళ్లు చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి పట్టుబట్టి.. తన సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరి లోక్‌సభ నుంచి వీరికి టికెట్ ఇప్పించారు. అనంతరం చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి 2019లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచిన రంజిత్‌రెడ్డి తిరిగి గులాబీ జెండా మీదనే పోటీ చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధమైనట్లు ప్రకటించారు. పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చి తన అభ్యర్థిత్వాన్ని సైతం ముందుగానే ఖరారు చేయించుకున్నారు. కానీ రాత్రికిరాత్రే అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి కండువా కప్పుకుని చేవెళ్ల స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. దీని తర్వాత ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి, గెలిచిన దానం నాగేందర్ సైతం రాత్రికిరాత్రే పార్టీ మారారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఇలా ముగ్గురు నేతలు కూడా గులాబీ చెంతనే ఉండి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హస్తం గూటికి చేరి లోక్‌సభ స్థానాల్లో పోటీ చేశారు. మల్కాజిగిరి, చేవెళ్ల, సికింద్రాబాద్... మూడు స్థానాల్లో జంపింగ్ జపాంగ్‌లకు ఓటర్లు షాక్ ఇచ్చారు. మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన సునీతా మహేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అక్కడ బీజేపీ తరఫున ఈటల రాజేందర్ విజయాన్ని కైవసం చేసుకున్నారు.

చేవెళ్ల పార్లమెంటు స్థానంలో కూడా రంజిత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఇక... సికింద్రాబాద్ స్థానంలో కూడా దానం నాగేందర్ ఓటమి పాలయ్యారు. ఈ స్థానంలో మాజీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతిలో దానం ఓటమి చెందారు.

- ఈ ఏడాది రూ.103 కోట్ల రుణాలివ్వాలని డీఆర్‌డీఏ అధికారుల నిర్ణయం
- ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యాపారులుగా మారిన 5194 మంది
- ఈనెలాఖరులోగా సభ్యుల ఎంపికకు చర్యలు
- వికారాబాద్ జిల్లాలో 20,294 సంఘాలు.. అందులో సభ్యులు- 1,63,321



# ఉపాధి కల్పనలో... లక్ష్యం దిశగా..

వికారాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) అభ్యున్నతికి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఎంతో కృషి చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీలకు సుస్థిర జీవనోపాధి కల్పించడమే కాకుండా వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ హయాంలో అమల్లోకి తీసుకొచ్చిన విలేజ్ ఎంటర్‌ప్రైజెస్‌ల ఏర్పాటు ప్రక్రియ ఈ ఆర్థిక సంవత్సరంలో వేగవంతమైనది. విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గతేడాది 5,932 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారులుగా మారారు. గతేడాది జిల్లాలో ఎంపిక చేసిన సభ్యుల్లో వందశాతం మేర మహిళలు గ్రామస్థాయిలోని పరిస్థితులకు అనుగుణంగా తమ బిజినెస్‌లను ఏర్పాటు చేసుకున్నారు. వారికి నష్టాలు రాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అవసరమైన రుణాలను బ్యాంకులు, సెర్ప్, స్త్రీనిధి ద్వారా మంజూరు చేస్తున్నారు. కాగా ఈ నెలాఖరులోగా ఎస్‌హెచ్‌జీలను ఎంపిక చేయాలని అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. విలేజ్ ఎంటర్‌ప్రైజెస్‌లో భాగంగా ప్రతి గ్రామంలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో ఆసక్తి ఉన్న వారిని ముగ్గురు చొప్పున ఎంపిక చేసి వారికి స్వయం ఉపాధి కల్పనలో కొత్త, కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన నైపుణ్యాన్ని, ఆర్థిక వనరులను కల్పించి సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమానికి సెర్ప్ శ్రీకారం చుట్టింది.

### మహిళలను వ్యాపారులుగా మార్చేందుకు..

విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 5,194 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యాపారులుగా మార్చాలని.. వారికి రూ.103 కోట్ల రుణాలను మంజూరు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు నిర్ణయించుకున్నారు. ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన ఒక్కో సభ్యురాలికి వ్యా పారం చేసుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నారు. అయితే మహిళలు గ్రామాల్లోని పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారు బిజినెస్‌లో నష్టపోకుండా ఉండేందుకు వ్యాపార మెళకువలు, నైపుణ్యాన్ని సెర్ప్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఓ గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు ఒకే రకమైన వ్యాపారం చేసుకోకుండా విభిన్నంగా చేసేలా ప్రోత్సహిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్నారు. కాగా స్వయం సహాయక సంఘాల్లోని చాలామంది సభ్యులు క్రింద ఉన్న వివిధ రకాల వ్యాపారాలను ఎంచుకున్నారు. అవి.. ఉత్పత్తి రంగంలో పేపర్‌ప్లేట్లు, బేకరీ, ఇటుకల తయారీ, విస్తరాకు తయారు యంత్రం, స్నాక్స్ యూనిట్, బాస్కెట్ తయారు, స్టేషనరీ, రైస్‌మిల్, చేనేత ఉత్పత్తి పరిశ్రమల వ్యాపారాలు.. ట్రేడింగ్ రంగంలో కిరాణా షాపులు, బట్టల వ్యాపారం, గాజుల దుకాణం, ఫ్యాన్సీ స్టోర్, కూరగాయల వ్యాపారం, డెయిరీ, పౌల్ట్రీ, గుడ్ల వ్యాపారం, ఫెర్టిలైజర్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపు లు.. సర్వీసు రంగంలో హోటల్, టిఫిన్ సెంటర్, టైలరింగ్, మటన్, చికెన్ షాపులు, పిండిగిర్ని, వాటర్‌ప్లాంట్, పాలవ్యాపారం, బ్యూటీపార్లర్, మొబైల్ ఫోన్ మెకానిక్, మెడికల్ షాప్, టెంట్ సప్లై సర్వీసు, వెల్డింగ్‌షాప్, కెమెరా ఫొటో స్టూడియో మొదలైనవి. కాగా జిల్లాలో 657 గ్రామసంఘాలుండగా.. స్వయం సహాయక సంఘాలు- 20,294 అందులో సభ్యులు 1,63,321 మంది ఉన్నారు.

# ఫలితం తేలింది.. ఉత్కంఠ వీడింది

- ప్రశాంతంగా జరిగిన చేవెళ్ల లోక్‌సభ ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియ
- ఎంపీగా విజయాన్ని కైవసం చేసుకున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి షాక్ ఇచ్చిన చేవెళ్ల పార్లమెంట్ ఓటర్లు
- ఓటమిని అంగీకరించి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే వెళ్లిపోయిన రంజిత్ రెడ్డి
- కౌంటింగ్‌లో పాల్గొన్న 671 మంది సిబ్బంది
- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

రంగారెడ్డి, జూన్ 4(నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు లోక్‌సభ ఎన్నికల ఘట్టం ముగిసింది. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నిక ఫలితం వెలువడడంతో ఉత్కంఠకు తెరపడింది. చేవెళ్ల లోక్‌సభ బరిలో 43 మంది నిలవగా.. 16,57,107 మంది ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి చేవెళ్ల ఓటర్లు ఏకపక్షంగా విజయాన్ని అందించారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రంజిత్‌రెడ్డికి చేవెళ్ల ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 8,09,882 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి 6,36,985 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు 1,78,968 ఓట్లు వచ్చాయి. కొండా విశ్వేశ్వర్ రెడ్డి 1,72,897 మెజార్టీతో గెలుపొందారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నది.

### ఎన్నికల విధుల్లో 671 మంది..

చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామునే కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నారు. పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతిచ్చారు. లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు మొదలైంది. ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఓపెన్ చేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. ఆ తర్వాత రౌండ్ల వారీగా ఈవీఎంలను లెక్కించారు. ఓట్లను లెక్కించేందుకు నియోజకవర్గాల వారీగా 165 టేబుళ్లను ఏర్పాటు చేశారు. వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ద్వారా కౌంటింగ్ ప్రక్రియను రికార్డు చేశారు. మధ్యాహ్నానికే గెలుపోటములపై స్పష్టత వచ్చింది. సాయంత్రం 6.30 గంటలకు దాదాపుగా పూర్తి ఫలితం వచ్చింది. ఎన్నికల విధుల్లో మొత్తం 671 మంది సిబ్బంది పాల్గొన్నారు.

### రంజిత్ రెడ్డికి గట్టి షాక్..

మంగళవారం వెల్లడైన చేవెళ్ల పార్లమెంట్ ఫలితాల్లో చేవెళ్ల ఓటర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి గట్టి షాక్ ఇచ్చారు. పార్టీ ఫిరాయింపులకు ఇక్కడి ఓటర్లు బుద్ధి చెబుతూ వస్తుండగా.. తాజా ఎన్నికలోనూ అదే పునరావృతమైంది. 2014 ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి పార్టీ ఫిరాయించి 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేయగా ఇక్కడి ప్రజానీకం ఓడించింది.

అలాగే.. 2019 ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచిన రంజిత్ రెడ్డి ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. అందరూ ఊహించినట్లుగానే ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. తొలి రౌండ్ నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధిపత్యం కొనసాగిస్తూ రావడంతో..ఓటమిని ముందే అంగీకరించిన రంజిత్ రెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



విజయోత్సాహంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు